# జాతకము

తమ తమ జన్మలలో మనుష్యులు చేస్తూ ఉన్న కర్మలూ వాటిఫలములూ చిత్రగుప్తులో వారి కింది గుమాస్తాలో జాబితాలు వ్రాసి ఉంచుకొంటారు. ఈజాబితాలన్నీ వారు బ్రహ్మదేవుడికి పంపిస్తారు. వీటినిబట్టి బ్రహ్మదేవుడు ఒక్కొక్క మనిషికీ ఒక్కొక్క జాతకం తయారుచేసి ఆ జాతకాల ననుసరించి మనుష్యులను పుట్టిస్తాడు. అంటే మనుష్యుడు పుట్టడానికి పూర్వమే అతని జాతకం బ్రహ్మదేవుడు తయారుచేసి తన ఆఫీసులో ఉంచుకొంటాడన్నమాట.

మనుష్యుని సౌందర్యాదులూ, మంచిచెడ్డలూ, కష్టసుఖములూ వగైరావిషయములన్నీ అతడు పుట్టడానికిముందే నిర్ణయింపబడి ఉంటవన్నమాట స్పష్టము.

ఇక మనుష్యుడు భూమిమీద పడ్డతరువాత అతనిజాతకం వ్రాద్దామని యితర మనుష్యులు ప్రయత్నిస్తారు. జాతకం వ్రాయడ మనగా బ్రహ్మదేవుడు వ్రాసిన జాతకంలో విషయములు ఏవిధముచేతనైనా గ్రహించడముకు ప్రయత్నించడమే. జననకాలమును బట్టీ, దేశమునుబట్టీ, గ్రహాదులగతులనుబట్టీ, యీరహస్యభేదనము చేయడముకు మనుష్యులు ప్రయత్నిస్తారు. జాతకము లేనిబ్రతుకు దీపములేని యింటివంటిదని వారు సూత్రముచేసి ఆసూత్రప్రకారముప్రతివాడూ జాతకము వ్రాయించుకోవాలని నిర్దేశిస్తారు. ప్రతివాడూ జాతకం వ్రాయించుకొంటాడు. కాని ఆ జాతకం నిదర్శన

మియ్యదు. ఏమండీ జాతకము నిదర్శన మివ్వడంలేదంటే జోస్యానికి పార్వతీదేవి శాపం ఉన్నదని వారు సమాధానం చెప్పుతారు. ఇటువంటి జాతకాలవల్ల లాభమేమిటి ? ఈగుడ్డి దీపం యింట్లో ఉంటే ఎంత లేకపోతే ఎంత అని అతడు నిరుత్సాహపడతాడు.

న్యాయానికి అతడు నిరుత్సాహ పడవలసిన అవసరము లేదు. మనుష్యుని సౌందర్యాదులు తెలుసుకోడానికీ మాతాపితాదులను గురించి తెలుసుకోడానికి జాతకము అవసరము లేదు. ప్రతిరోజూ యీ విషయములు అతనికి అనుభవైక వేద్యములే. ఇంక కష్టసుఖములు లాభనష్టములు తెలుసుకొనడముకు కూడా జాతకాలు అవసరము లేదు. జాతకాలున్నప్పటికీ అవి సరియైన నిదర్శనమివ్వడం లేదు. కాబట్టి అవి ఉన్నా లేనివాటిలోనే జమ.

అయితే కష్టసుఖాదులు తెలుసుకోవడం ఎలాగంటే దానికి ఒక సూక్ష్మమార్గ మున్నది. ఈ సూక్ష్మమార్గము ననుసరించి ఎవరిపుట్టుకువారు తమతమ భావిఫలములను గ్రహించుకో వచ్చును. దీనికోసం జోస్యుల నాశ్రయించడం, డబ్బు ఖర్చుపెట్టడం, ప్రకటనల కోసం పత్రికలను తిరగ వెయ్యడం ఇత్యాదిపనులు చేయవలసిన పనిలేదు. ఈ మార్గం ఏమిటంటే —

ప్రొద్దున్నే లేచి ఎవరిమొహంచూస్తే ఏయేఫలాలు సంభవిస్తాయో, రాత్రుళ్ళు ఏయేకలలు గంటే ఏయే ఫలాలు వస్తాయో, వీధిలోకి వెళ్ళేటప్పుడు ఏయే శకునాలు వస్తే ఏయే ఫలాలు ముట్టుతాయో, వెనక తుమ్ము ముందు తుమ్ముల

ఫలం యేమిటో, పంచాంగము పరిశీలించేవారి కందరికీ తెలిసినవిషయమే. వాటినిగురించి యిక్కడ చెప్పదలచుకోలేదు. నేను చెప్పదలచిన విషయములేమంటే —

ఆ యింట్లో నీవు పదేళ్ళబట్టి కాపురమున్నావు. వీధి గుమ్మందాటి లోపలికి వెళ్ళడం, లోపలినుంచి గుమ్మందాటి వీధిలోకిరావడం, చాలాసారులు జరిగి ఉంటుంది. కాని ఎప్పుడూ ఏమీ ప్రమాదము కలగలేదు. కాని దశాచ్ఛిద్రము వచ్చినా, అంతర్దశ విదశలు జబ్బిచ్చినా, గుమ్మం దాటేటప్పుడు ద్వారబంధం టక్కున బట్టతలకు తగిలి బొప్పి కట్టడమో, లేకపోతే గడపకాలికితగిలి సాష్టాంగంగా బోర్లా పడడమో జరుగుతుంది.

ఈరీతిగా చాలామారులు జరిగినట్లయితే దశమారిపోయిందని ఊహించుకోవాలి. ఒకమారు అజాగ్రత్తవల్ల గుమ్మం తగిలి తలబొప్పికట్టిందని నీవు చాలాజాగ్రత్తగా నడుస్తూ వంగుని, కాలెత్తి జాగ్రత్తగా గుమ్మందాడడానికి ప్రయత్నిస్తావు. జాతకం బాగుంటే సరేసరి; బాగులేకపోయినట్లయితే ఎంతజాగ్రత్తగా ఉన్నాసరే జరిగేదేమో జరగకమానదు. ఎంతో వంగుని నీవు గుమ్మందాటేటప్పుడు నీతోపాటు ద్వారబంధం కూడా వంగి తలకు తగిలితీరుతుంది. లేదా కాలెత్తి ఎంతోజాగ్రత్తగా నీవుగడపదాటుదా మనుకుంటే, కాలితోపాటు గడప పైకిలేచి (లేచినట్లుమాత్రం అగుపడదు) కాలికి అడ్డువచ్చి భూమిని ఆలింగనం చేయిస్తుంది.

ఎన్నోమార్లు ఆరోడ్డున నడచిఉంటాము. ఆరోడ్డుసంగతి అన్నివిషయాలూ — ఎత్తులు, పల్లాలు, రాళ్ళు, గోతులు

ఇత్యాది — మనకు కంఠతా వచ్చి ఉంటని. కాని జాతకం జబ్బిచ్చిప్పుడు గోతులో కాలుపడి కాలికి ఇరుకు నొప్పిపట్టడమో. రాళ్ళులేనిచోటకు రాళ్ళువచ్చి బొటనవ్రేలికి తగిలి పొప్పరూడిపోవడమో, కాలితో కూడా రాళ్ళుపైకిలేచి ఆరాళ్ళుకాలికి గట్టిగాతగలడమో ఏదోఒకటి సంభవించి తీరుతుంది. ఇటువంటి వేవిసంభవించినా వీటినిబట్టి భావిఫలములను జాతక మక్కరలేకుండా తెలుసుకోవచ్చుగదా! ఇంకో సంగతి —

మనము చేసేసహవాసాలవల్లకూడా మనకు మనజాతకం కొంతవరకు తెలుస్తుంది. ఒకనికి ఒకమాటు ఒకకవీశ్వరుడి స్నేహంచెయ్యడం తటస్థించింది. ఎలా తటస్థించిదంటే — ఆకవీశ్వరు డొకనాడు చేత్తో నల్లేరుకాడలు పట్టుకొని అతనికి కనిపించాడు. "నల్లేరుపట్టుకువెడుతున్నారు. ఏమిచేస్తారండోయి కవీశ్వరుడుగారూ?" అని ఆయన కుశలప్రశ్నచేశాడు. అప్పుడు కవీశ్వరుడు నవ్వుతూ అన్నాడుగదా "మన పూర్వులు ఏమన్నారంటే—ఒక నుయ్యైనా తవ్వించాలి, ఒకచెరువైనా తవ్వించాలి, ఒక గుడైనా కట్టించాలి, ఒకమొక్కైనా పాతించాలి అని. పోనీ మనపెద్దలమాట ఎందుకు కొట్టివెయ్యడం అని ఆలోచించి యీనల్లేరుమొక్క మాదొడ్లో పాతుదామని తీసుకు వెళ్ళుతున్నాను."

ఆ క్షణమే అతడు కవీశ్వరుడితో జట్టుకట్టాడు. అంతే కాకుండా ఆ కవీశ్వరుడికి తనయింట్లో ఒకభాగం అద్దెకు కూడా యిచ్చాడు. హ్రస్వదృష్టితో ఎప్పుడైతే యీపని చేశాడో అప్పటినుంచీ అతని పాట్లు వర్ణించ నలవి కావు.

పాపము అతనికి వేళపట్టున తిండిలేదు, వేళపట్టున నిద్రలేదు. తెల్లారితే సరి, కవీశ్వరు డాయన్నిచూచి "ఆఁ లేచారా, రండి. రాత్రి వ్రాశాను ఈపద్యాలు, ఎలా ఉన్నాయో చూడండి" అని కూర్చోబెట్టి ఆపద్యాలు చదివి ప్రతిపదార్థాదులు చెప్పి అలంకారాలు చెప్పి పూర్వకవుల పద్యాలతోనూ ఆధునికుల పద్యాలతోనూ వాటిని పోల్చిచూపి వాటి ఆధిక్యత నచ్చజెప్పి ఏపన్నెండు గంటలకో భోజనానికి వదలిపెట్టేవాడు. మొహమాటం కొద్దీ ఆతడు కవీశ్వరుడు పెట్టుతూ ఉన్న యమయాతన సహించి ఊరుకొన్నాడు. ఆయన యీ మధ్య ఒట్టు పెట్టుకొన్నాడు. బ్రతికిఉండగా కవీశ్వరుడన్న వాడితో మాట్లాడననీ, తన యిల్లు అటువంటివాడికి అద్దెకు ఇవ్వననీ.

అతని జాతకం ఎన్నాళ్ళైతే జబ్బుగా ఉందో అన్నాళ్ళూ ఆ కవీశ్వరుడి సహవాసం తప్పలేదు. జాతకం అక్కరలేకుండానే యిటువంటి నిదర్శనాలు ఉంటూ ఉంటే ఇంకా జాతకం వ్రాయించుకోవడ మెందుకు ?

కవీశ్వరులు రెండురకాలు — ఒకరకం తుమ్మెద కవీశ్వరులు, ఇంకోరకం సాలెపురుగు కవీశ్వరులూను. తుమ్మెద కవు లేమిచేస్తారంటే ఆ పువ్వునూ ఆ పువ్వునూ ఆశ్రయించి వాటిలో మకరందమూ, పుప్పొడీ తీసి యింటికివచ్చి తేనె పట్టుపెట్టి అందులో మకరందం దాచి అదే తమ ప్రయోజకత్వం అని లోకానికి వెల్లడిచేస్తారు.

ఇక సాలెపురుగుకవు లేమి చేస్తారంటే గూడుకు కావలసిన సామగ్రిఅంతా తామే సమకూర్చుకొని, సాధనాలన్నీ చూచు

కొని, గూడు ఎప్పుడు ఎక్కడ ఏరీతిగా కట్టాలో ఆలోచించుకొని ఆరీతిగా కట్టుతారు.

జాతకఫలాలు తెలుసుకోవడం విషయములో ఈఉభయుల సహవాసం ఒక్క మోస్తరు ఫలములనే ఇస్తుంది కాబట్టి పాఠకులు జాగ్రత్తగా ఉండవలసి ఉంటుంది.

జాతకం దశ మారడానికి సిద్ధంగా ఉన్నపుడు మన ప్రశ్నలకు సరియైన సమాధానాలు రావు. ఈసంగతి గ్రహించి మనజాతకం మారుతూ ఉన్నదన్నసంగతి మనము గ్రహించుకోవాలి. ఒక ఆసామి తన కొడుకును పిలిచి “అబ్బాయీ! యీ ఉత్తరం పోస్టులోపడేసిరారా” అంటే కొడుకు అన్నాడు గదా “ఆపోస్టులో ఉత్తరాలు వెళ్ళవు నాన్నా, నేను చూశాను. ఆపోస్టు ఎపుడూ అక్కడే ఉంటుంది.” ఆ ఉత్తరం కొడుకు పోస్టులో వెయ్యలేదు. తండ్రే వేశాడు ఎండలో పరుగెత్తుకువెళ్ళి! వెళ్ళదనే నిశ్చయంతో కొడుకు ఉత్తరం పోస్టులో వేస్తే అది వెళ్ళదలచి ఉన్నా వెళ్ళడం మానుతుందని అతని భయం.

ఇంక కొందరిజాతకం సాధారణంగా నెల నెలంతా సరిగ్గా ఉండి మధ్య మధ్యను మాత్రం చాలా నీచలోకి దిగుతుంది. అది శీతాకాల మనుకోండి. చలిచేత పక్కలు వంచుకుపోతున్నాయి. వెచ్చని పరపుమీద వెచ్చనికంబళీ కప్పుకొని తెల్లవారిన తరువాత తాగబోయే వెచ్చ వెచ్చని కాఫీనిగురించి సుఖస్వప్నము కంటున్నా డనుకోండి ఒకపెద్దమనిషి. అప్పుడే తెల తెల వారుతోంది. అతడు పూర్తిగా నిద్రాలేని పూర్తిగా మెలకువాలేని స్థితిలో ఉన్నాడు. ఆసమయంలో

ఎక్కడో సమీపంనుంచి వచ్చి మధురధ్వని అతనిచెవులో పడుతుంది. "ఏమండీ, ఏమండీ, తెల్లారుతోందండీ" అనే ధ్వని. ఆ ధ్వని లక్ష్యముచేయక అతడు మరింత గట్టిగా కంబళీని తన్నిపెట్టి స్వప్నము చెడిపోకుండా ఉండడానికి దానిమీదనే బుద్ధినిలిపి ఉంటాడు. మళ్ళీ ఆ ధ్వని. "ఏమండీ; ఇంకా నిద్రేనా; ఇదిగో చూడండీ; ఏమండీ; వినబడ్డంలేదూ." అని ఉండుండీ ఆ ధ్వని చెవులో పడడముచేత అతడు ఆ ధ్వని తన భార్యదిగా గ్రహించి ఇంక మాట్లాడక ఊరుకుంటే ఏమి కొంప మునుగుతుందో అని బద్ధకంగా "ఊఁ" అంటాడు. ఇతర సమయాల్లో ఆ ధ్వనిని అతడు 'కలస్వనంబు' అనీ 'మధురమంజుల కంఠరవంబు' అనీ అనే వాడేగాని ఈ సమయములో "ఏమిటా వెధవగోల" అనదలచి నోటిదాకా వచ్చిన ఆ మాటలను దిగమింగి, ఆ మాటే అంటే కొన్నాళ్ళదాకా ఇంట్లో తనకు పరువుదక్క దనుకొని, పెద్దమనిషి తరహాగా 'ఊఁ' అంటాడు. ఆవిడ మళ్ళీ "ఏమండీ, ఆ కంబళీ తీసి ఒకమాటు కూచోండీ; ఇదిగో; ఎంతపిలిచినా పలకరేమిటమ్మా; ఏమండీ" అని అంటుంది. అతడు స్వప్నము చెడినందుకు విసుగుకొంటూ మోటుతనంగా ఏమాట అనడానికీ భయపడి, చలిని ఒకమారు తలచుకొని "ఎందుకూ" అంటాడు. "తెల్లవారిన తరువాతకూడా ఆ నిద్రయేమిటి? ఒకమాట్లు లేచి దాసీది వచ్చింది కాబోలు, అంట తప్పేలాలు దాసీదాని కోమాటు పడవేసి, వంటిల్లు కొంచెం బాగుచేసి, పొయ్యిలో నిప్పువేస్తేనే గాని కచేరికి ఆలస్యం అవుతుందేమో! తరవాత మీ యిష్టం; కుర్రాళ్ళు

లేచి చద్దన్నం కోసం ఏడుస్తారుకూడాను” అని ఆవిడ చల్లగా జారవిడుస్తుంది.

తన విధిని తిట్టుకొని, ఇటువంటి అనుభవాలు తనకు రావడానికి పూర్వజన్మంలో ఏమి కర్మలుచేసి ఉండాలో ఒక మారు ఆలోచించి, తన జాతకం ఆనాడు మొదలు మూడు రోజులదాకా చాలా నీచలోకి దిగిం దనేసంగతి గ్రహించి, ఎవరిని ఏమనడానికీ భయపడి, నిమ్మళంగా లేస్తాడు.

ఆక్షణం మొదలుకొని మూడురోజులదాకా తన భార్య ఉత్తరవులను తూచా తప్పకుండా అతడు నిర్వహించడముకు పూనుకొంటాడు —

పొయ్యిలో నిప్పువెయ్యడానికి ఊరంతా తగులబెట్టడానికి సరిపడే అరడబ్బా కిరసనాయిలూ, నాలుగు అగ్గిపెట్టెలూ ఖర్చుపెట్టి, కర్రలనూ, కిరసనాయిలూ గట్టిగా తిట్టి తన భార్యను మాత్రం మనసులో తిట్టుకొని నీళ్లోడుతూ ఉన్న పొయ్యకేసి చూచి బిక్కమొహం వేసి బియ్యం కడగడానికి నూతిదగ్గిరికి వెళ్ళుతాడు. పొయ్యి మహా తెలివైనవస్తువు; ఆడవాళ్ళ అదుపాజ్ఞలలో ఉంటుంది. వాళ్ళను చూచేటప్పటికల్లా అది రాజి భగ్గున మండుతుంది. ఆడవాళ్ళంటే దానికి భయమో అభిమానమో ఏదో ఉండి ఉండాలి. ఇంక మొగవాళ్లను చూస్తే ఆ పొయ్యే లోకువ గట్టుతుంది. మండించడానికి మగవాడుగానే ప్రయత్నం చేశాడా, పొయ్యి కిక్కురమనకుండా నీళ్ళు గారుతుంది. మంట అక్కర్లేదు. అన్నం అడుగంటుతుందని అతడు అనుకున్నాడా, ఆ పొయ్యి భగభగమండిపోయి ఆర్పడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా లక్ష్యపెట్టదు.

తన భార్య వంటచేసినప్పుడు అతడు ప్రతివస్తువుకూ అనేక వంకలు పెట్టడం అలవాటు. తాను వంటచేస్తూ ఉన్నప్పుడు అతడు నలపాక భీమపాకాలసి మించి వండదలచుకొంటాడు. కాని ఫలితమేమిటంటే, అన్నం అడుగంటనైనా అడుగంటుతుంది; లేకపోతే చిమిడిపోతుంది; లేకపోతే అంతా బియ్యమే. మిగిలిన వస్తువులలో ఉప్పూ కారమూ మొదలైన పదార్థాలు వేటికవి స్వరాజ్యం చేస్తూ ఉంటాయి.

కుర్రవాళ్ళకి అన్నంపెట్టడం ఒకపెద్ద పేచీపని. వాళ్ళు తినమంటే తినరు. పోనీ అని పెట్టపోతే నోరుపట్టరు. అతని అనుభవాన్నిబట్టి ఇటువంటి చిక్కులలో పడే ప్రజలందరూ నేర్చుకోవలసిన విషయమొకటుంది. పిల్లవాడు అన్నం తినక నోరుపట్టక పోయినట్లయితే నిమ్మళంగా తొడపాశం పట్టాలి. అప్పుడు వాడు నోరు తెరిచి ఏడుస్తాడు. ఒక ముద్ద వాడి నోట్లో పెట్టి నోరు ముయ్యాలి. అప్పుడు తినకఏమిచేస్తాడు! ఈ ప్రక్రియ అనేకచోట్ల జయప్రదంగా నెరవేరింది. పిల్లలున్న వాళ్ళందరూ యీ ప్రక్రియ తప్పకుండా అవలంబించవలెనని లోక కల్యాణమును కోరే అతని అభిప్రాయము.

ఏలాగైతే నేమి ఆరోజుకు వంటముగించి పిల్లలకీ భార్యకీ యింతపెట్టి తానింత తిని, కాలిన చేతివేళ్ళకేసి ఎర్రబడి నీళ్ళు కారుతూ ఉన్నకళ్ళతో చూచి ప్రపంచమంతా తన విరోధులే అనే దృఢ విశ్వాసముతో అతడు కచేరికి వెళ్ళుతాడు.

ఆ మూడురోజులకే జాతకం వ్రాయడమెందుకు? మొదటి రోజు "ఏమండీ" అనే శబ్దం అతని చెవులో పడిందిమొదలు అతని జాతకం స్పష్టముగా తెలుసుకోవచ్చునుగదా!

కొందరు మనుష్యులకు చిన్న చిన్న చిక్కులు ఆజన్మం సంభవిస్తూనే ఉంటవి. అవి జాతకాన్ని తెలుసుకోవడముకు కొంతమట్టుకే పనికివస్తవనే సంగతి అందరూ గ్రహించవలసి ఉంటుంది.

ఆయన చాలా చదువుకొన్నవాడని పేరు. నే నొకమారు ఆయన దర్శనం చేయడానికి వెళ్ళాను. నే వెళ్ళేటప్పటికి ఆయన భాగవతం చదువుతున్నాడు. నేను నమస్కరించి కూర్చుని వింటున్నాను. ఒక అరగంటసేపయింది. ఆయన భాగవతం కిందబెట్టి యిటూ అటూ చూచాడు. వెదకడం మొదలుపెట్టాడు. చుట్టూఉన్న పుస్తకా లన్నీ తల్లకిందులు చేశాడు. వ్యాసపీఠం ఎత్తిచూచాడు. భాగవతం ఎత్తి కింద చూచాడు. భాగవతం కాగితా లన్నీ తిరగవేసి చూసాడు. లేచాడు. కూర్చున్నాడు. మధ్యమధ్య పెళ్ళాన్నీ కొడుకులనీ తిట్టాడు.

"ఇక్కడే పెట్టానండీ, ఇప్పుడేనూ" అన్నాడు. మళ్ళీ భాగవతమంతా తిప్పి పరిశీలించాడు. బట్ట తడముకున్నాడు. "ఇంతట్లోకే ఎక్కడకు పోయిందో; ఎప్పుడూ యింతే" అని విసుకుకున్నాడు. పుస్తకాలు ఇటూ అటూ విసరికొట్టాడు. చివరకు దొరికింది—పొడుంకాయ! రొండినున్న పొడుం కాయసంగతి మరచిపోయి యింత బాధపడ్డాడు. ఒకపట్టు పొడుంపీల్చుకొని భాగవతం పుస్తకంకోసం వెతికి, తరవాత పేజికోసం వెతికి, వ్యాసపీఠంమీద పెట్టి, మళ్ళీ పురాణం చెప్పడం మొదలుపెట్టాడు. అరగంట అయింది. పొడుం పీల్చుకోవాలని బుద్ధి పుట్టింది. మళ్ళీ పొడుంకాయ వేట

ప్రారంభం. గుర్తుగా ఉండాలని కాలిక్రింద పెట్టుకొన్నపొడుంకాయ కనబడదు. యథాప్రకారం మళ్లీ చేయవలసిన పనులన్నీ చేసి భార్యనీ పిల్లలనీ తిట్టినతరువాత గావంచాలో పొడుంకాయ దొరికింది.

ఆయన చాలా తమాషామనిషి. ఒకమారు ఆయన పంక్తిని కూర్చుని భోజనము చేస్తున్నాను. ఆయన భార్య పచ్చడి వడ్డించేటప్పుడు చెయ్యి జారి సగం పచ్చడి కిందా, సగం విస్తట్లోనూ పడింది. అయన ఏమీ కోపం చెయ్యలేదు. నెమ్మదిగా "ఏదీ ఒసే, కొంచెం బుర్రవంచు. ఆ నెత్తిమీదా అవి యేమిటి?" అన్నాడు. ఆవిడ ఏమిటో అనుకొని బుర్ర వంచింది. ఆయన పరిశీలనగా రెండు నిముసాలు చూచి 'అబ్బే మరేమీ లేదు. నెత్తిమీదకుగానే వచ్చాయేమో నని చూచాను' అన్నాడు. ఆవిడ ఏమిటంది. ఆయన వికటంగా 'కళ్ళు' అన్నాడు.

ఇంకోమారు ఆయనా నేను భోజనము చేస్తూఉన్నాము. ఆవిడ చారు వడ్డించింది. ఆయన పురిషెడు చారు పుచ్చుకొని ఒకమారు సకిలించి, పెళ్ళాన్ని పిలిచి "చూడొసే; నాలుక ఎలాగ ఉందో ఒకమాటు చూడు," అన్నాడు. ఆవిడ చూచి బాగానే ఉన్నదన్నది. ఆయన "బాగా చూడు. చిల్లులూ ఏమీ పడలేదుగదా" అన్నాడు. ఆవిడ బుర్రవంచుకొని వెళ్లిపోయింది.

ఇంక ఆవిడ సంగతి. ఆవిడ మొగంనిండా చక్కగా బొట్టు పెట్టుకొంటుంది. ఎంత పెద్దబొట్టు పెట్టుకుంటే అంతకాలం అయిదో తనం అనుభవించ వచ్చునని ఆవిడ ఊహ.

మొగుడు తనతో సంతోషంగా మాట్లాడిన రోజున—అంటే నీకు కొత్తచీరకొని పెట్టనా అనీ, తెల్ల ముక్కుపుడక చేయించనా అనీ, కాసులు గుచ్చుకోడానికి దారం పేనిపెట్టనా అనీ ఈరీతిగా మాట్లాడిన రోజున—ఆవిడ పెద్దబొట్టు పెట్టుకొనేది. తనకు భర్తమీద ఏరోజునైనా అనురాగం కలిగినప్పుడుకూడా—అనగా తనకు ఇష్టమైన పెరుగుతోటకూర బజారునుంచి తెచ్చినప్పుడూ, పొరుగూరు వెళ్లి వచ్చేటప్పుడు కొత్తవుట్టిగాని పేలాలకి పచ్చజొన్నలు కాని తెచ్చినప్పుడూ—ఆవిడ పెద్దబొట్టు పెట్టుకొనేది.

తనమీద ఎందుచేతనైనా భర్తకు కోపం వచ్చినపుడూ, లేదా తనకు భర్తమీద కోపం వచ్చినపుడూ - అనగా దొండకాయకూర వండవద్దన్నపుడు అది వండినా, అత్తిసరు రాత్రిళ్లు పెట్టవద్దన్నా, పప్పులో బెల్లం గుమ్మడికాయ ముక్కలూ వెయ్యవద్దన్నా, పొరుగింటి వెంకమ్మ మొగుడుతో మాట్లాడినా (ఆవిడకూ వెంకమ్మకూ అలుకుగుడ్డ విషయమై ఆమధ్య పేచీవచ్చింది) ఆవిడ చాలా చిన్నబొట్టు పెట్టుకొనేది.

చాలా కోపం వచ్చినపుడు అన్నం వండడం మానివెయ్యడమే కాకుండా బొట్టు పెట్టుకోవడంకూడా మానివేసేది. తన బొట్టుకీ భర్త ఆయుర్దాయానికీ పరస్పర సంబంధం ఉన్నదని ఆవిడ అభిప్రాయము.

ఇటువంటి చిక్కులు ఆజన్మం ఉండేవే కాబట్టి దీనినిబట్టి జాతక ఫలములను సరిగా చెప్పడం కష్టము.

కొందరి చర్యలవల్ల వారి జాతకమే కాకుండా గ్రామము జాతకము దేశము జాతకమూ కూడా చెప్పవచ్చు. మాఊళ్ళో

సీతయ్యగారనే ఒక పెద్దమనిషి ఉన్నాడు. ఆయనకు ఇళ్ళు కట్టించడం అంటే ఎంతో సరదా. ఆయన పునాదులు తీయించి గోడలు పెట్టడానికి అడుసూ లేకపోతే సున్నం కలిపి పీఘుల్లోపెట్టి, సగం గోడ లేవదీసేటప్పటికల్లా ఎంత మండు వేసంగిలోనైనాసరే ఏకాలమునైనాసరే వాన కురిసి తీరుతుంది. పంచాంగం సహాయము లేకుండా, గవర్నమెంటువారి వాతావరణశాఖోద్యోగి సహాయం లేకుండా, వాన రాకను గురించి సీతయ్యగారి గోడల సహాయముతో చెప్పవచ్చును. ఆయన భార్య రామమ్మగారి విషయం కూడా అంతే. ఆవిడ వడియాలు పెట్టడానికి గుమ్మడికాయ తరిగి, పప్పు రుబ్బడం తరవాయిగా వాన కురిసి తీరుతుంది. ఆ వడియాలన్నీ యింట్లో ఉండి బూజుపట్టేదాకా వాన వెలవనే వెలవదు. అందుచేతనే ఆ వూరి వారంతా వానలు వెనకబట్టినప్పుడు కుంభాభిషేకాలు మొదలైనవి చెయ్యడం తలపెట్టక సీతయ్యగారి దగ్గిరికి వచ్చి ఏదైనా గోడ కట్టమనీ, లేకపోతే రామమ్మగారి దగ్గిరకు వచ్చి రెండు గుమ్మడికాయలూ కుంచెడు మినుములూ యిచ్చి తప్పకుండా వడియాలు పెట్టమని ప్రార్థిస్తారు. ఆ వూరికి ఎప్పుడూ అనావృష్టిదోషం పట్టలేదు. చూచారా గ్రామంయొక్క జాతకం ఒక కుటుంబంవారి చర్యలనుబట్టి ఏరీతిగా చెప్పడానికి అనుకూలముగా ఉంటుందో!

ఇక పిల్లలున్నవాళ్ళకి ఎపుడూ జాతకం మంచిది కా దని ఒక విధివాక్యము చెప్పవచ్చును. కావ్యాలలో మాత్రం, పిల్లలవల్ల భూలోకస్వర్గ మనుభవిస్తామని చెప్పబడి ఉంటుంది. కాని పిల్లలున్నవాళ్ళ అనుభవము వేరుగా ఉంటుంది.

శుభ్రముగా బట్టలు కట్టుకోని అపేక్షతో తన చిన్నపిల్ల వానిని ముద్దుపెట్టుకోవలెనని ఎత్తుకోవడంతోనే వాడు నవ్వుతూ నవ్వుతూ బట్టలన్నీ పాడుజేసి పారేస్తాడు. అనుభవించిన వాళ్లకిగాని ఇందులో సుఖం కనిపించదు.

సుఖంగా రాత్రి నిద్రపోతూంటే గొల్లున గోలపెట్టి తను నిద్రపోకుండా ఇంట్లో ఎవరినీ నిద్రపోనీకుండా చేస్తాడుపిల్లవాడు. వాడిని ఓదార్చడానికి బ్రహ్మదేవుడు దిగిరావాలి. తీరా ఓదార్చేటప్పటికి తెల్లవారుతుంది. ఇంక వాళ్లు రాత్రీపగలూ చేసే అల్లరికీ, పాడుచేసే వస్తువులకూ, చింపే పుస్తకాలకూ మితిలేదు. మిగిలిన విషయాలు చూద్దామంటే—తెలివితేటలా సున్న. ఎవరికైనా జాలిపుట్టించేస్థితిలో ఉంటారుగాని పిల్లలు ఎవరినీ మెప్పించే స్థితిలోఉండరు. ఇటువంటి పిల్లలను పెట్టుకొన్నవాళ్ల జాతకం మంచిదని ఎలాగ చెప్పవచ్చును ?

కాని యిందులో ఒక మెరుగుఉంది. ప్రతికష్టానికీ ఒక విరుగుడు ఉండిఉంటుంటి. పిల్లవాళ్ల విషయంలో ఆ విరుగుడు బూచాడు. బూచాడంటూ ఒకడుండబట్టి—నిజంగా ఉన్నా లేకున్నా—పిల్లలుగలవాళ్ళు వాడిధర్మమా అని బ్రతుకుతున్నారు. లేకపోతే వాళ్ళపాట్లు చెప్పాలా ?

పూర్వకాలంలో బూచాడితోపాటు బడిపంతులు పిల్లల విషయంలో యములాడికింద ఉండేవాడు. కాని యీమధ్య ఆ హక్కు అతడు వదలుకోవలసి వచ్చింది.

జాతకం తెలుసుకోడానికి పైవిషయాలతో పాటు ఈకింది సలహా కూడా అందరూ గమనించవలసి ఉంటుంది.

ఎవరికైనా కష్టాలు తటస్థించినపుడు అతడు - ఇది నా

ఖర్మం అనీ, లేదా విధి అనీ, లేదా జాతక మహిమ అనీ అనుకుంటాడు. 'విధి' అనేది లేక పోతే-అనేవాడు ఒక సరదా మనిషి. మనుష్యులను కష్టపెట్టడం దాని సరదా. ఎవరు ఎక్కువ లొంగుతారో వారి నది ఎక్కువగా కష్టపెట్టుతుంది. కాబట్టి మనము విధికి లొంగినట్లు ఎంతమాత్రమూ కనబడ కూడదు. మనమే విధిని లొంగ దీసుకొన్నట్లు దానికి కన బడాలి. అందుచేత ఎప్పుడూ విధిని గురించి ఫిర్యాదు చెయ్య కూడదు. విధితో కలహించకూడదు. విధికి లొంగనట్లు నటిం చాలి. ఈ విధంగా చేసినట్లయితే విధి బుఱ్ఱవంచుకొని సిగ్గు తో లేచిపోతుంది. "అయ్యో ఎంత ఖర్మం వచ్చింది" అని అన్నావా, విధి నెత్తిక్కి తొక్కుతుంది.

గుమ్మం తలకి తగిలి బొప్పికట్టినప్పుడు తల తడుముకొని కళ్లవెంబడి నీళ్లు కార్చగూడదు. అలాగా చేస్తే విధికి లోకు వవుతాము. ఏమిచెయ్యాలంటే గుమ్మం టక్కున తగలడం తోనే నవ్వాలి. గుమ్మంకేసి చూచి గుమ్మాన్ని ఒకమాటు దువ్వాలి. గుమ్మంకఱ్ఱ చాలా గట్టిదని ప్రశంసించాలి.

రైలుబండికోసం ప్రయాణమై వెళ్ళితే జాతకం బాగు లేనపుడు అది తప్పిపోతుంది. అలాంటపుడు 'అయ్యో బండి తప్పిపోయిందే' అనకూడదు. బండి తప్పిపోవాలనే ఉద్దేశ్య ముతోనే తానక్కడకు వెళ్లినట్లు నటిస్తే విధి లొంగిపోతుంది. లేకపోతే విధి అనేక చిక్కులు పెట్టుతుంది.

ఒకకూలివాడిచేతికి నేతిచెంబిచ్చి నేను ముందు నడుస్తు న్నాను. అపుడు నాకు జాతకం జబ్బురోజులు. నాజాతక ప్రభావమువల్ల వాడు రాతిని తన్ని కిందబడి నెయ్యి పార

పోశాడు. వాడితో నేను దెబ్బలాడతానని విధి అనుకొన్నది. నేనాసంగతి గ్రహించి వాడితో సాదరంగా మాట్లాడి కాలికి దెబ్బతగలలేదుగదా అని ఊరడించి నిర్ణయించిన కూలికంటె అర్ధణా ఎక్కువయిచ్చి పంపించివేశాను. విధి సిగ్గుపడి పారిపోయింది.

ఏదైనా పత్రికకు వ్యాసం గాని పద్యం గాని పంపించి దానిని చప్పున ప్రకటించక పోయినట్లయితే విసుగుకో కూడదు. ఆలస్యంగా ప్రకటిస్తారనే ఉద్దేశముతోనే వాటిని పంపినట్లు నటిస్తేనేగాని విధి లోకువ గట్టుతుంది. అందుచేత ఏమిచెయ్యాలంటే, ఆ పత్రికాధిపతికి ఉత్తరం వ్రాసి ఆలస్యంగా వేసినందుకు తన కృతజ్ఞత తెలియజెయ్యాలి. "మీరు నా వ్యాసము ఆరునెలల తరువాత మీ పత్రికలో ప్రకటించినందుకు నేను చాలా కృతజ్ఞుడను. ఇక ముందుకూడా యీరీతిగానే నా వ్యాసములు ప్రకటిస్తూ ఉంటే నేను చాలా సంతోషిస్తాను. మీరు అలస్యంగా వేస్తారనే షరతుమీదనే మీకు నా రచనలు పంపుతూ ఉంటాను." అని ఈ మాదిరిగా ఉత్తరం వ్రాయాలి. విధిని జయించడానికి, ఎప్పుడూ జాతకం బాగుపడని గ్రంథకర్తలకు, ఇదేమార్గం.

ఈ వ్యాసములో సుళువు బలువులు గ్రహించి మెలకువలు తెలుసుకొని ఎవరిజాతకం వారు తమ తమ దినచర్యలనుబట్టి తెలిసికోవడముకు ప్రయత్నంచేస్తూ ఉన్నట్లయితే నా శ్రమ వ్యర్థము కాలేదని తలుచుకొనడముకు అవకాశం చిక్కుతుంది.